
మాసబ్‌చెరువు వద్ద పరిరక్షణ సమితి సభ్యులు

మాసబ్‌చెరువును సందర్శించిన పరిరక్షణ సమితి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్‌లోని మాసబ్‌చెరువును శుక్రవారం చెరువు పరిరక్షణ సమితి అధ్యక్షుడు బచ్చిగళ్ల రమేష్ ఆధ్వర్యంలో సమితి సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ చెరువును రక్షించుకునేందుకే పరిరక్షణ సమితిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెరువు ఆక్రమణపై హైడ్రా కమిషనర్‌కు పరిరక్షణ సమితి ఫిర్యాదుతో కొంత మేరకు ఆక్రమణల పర్వానికి తెరపడిందన్నారు. చెరువులో వినాయక నిమజ్జనం తర్వాత వాటి వ్యర్థాలను తీసివేయడం లేదని దీనిపై మున్సిపల్ కమిషనర్లకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. కబ్జాదారుల నుంచి చెరువును రక్షించుకోవడానికి పరిరక్షణ సమితి కృషి చేస్తుందన్నారు. మరోసారి హైడ్రా కమిషనర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలుస్తామని రమేష్ తెలిపారు. కార్యక్రమంలో బోసపల్లి ప్రతాప్, కొశిక ఐలయ్య, కొంతం యాదిరెడ్డి, కళ్యాణ్‌నాయక్, బొక్క వంశీధర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, వీరేశం పాల్గొన్నారు.



ఫ్రెషర్స్‌డేలో విద్యార్థులతో సెంట్రల్ డ్రగ్ కంట్రోల్ అధికారి రాంకిషన్

ఫార్మా రంగంలో మెరుగైన అవకాశాలు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఫార్మారంగం విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సెంట్రల్ డ్రగ్ కంట్రోల్ అధికారి డాక్టర్. రాంకిషన్ అన్నారు. శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం సుర్మాయిగూడలోని కేవీకే ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్ డే, సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాంకిషన్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదలతో పాటు లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఉన్నత శిఖరాలకు చేరుకుని తల్లిదండ్రుల కలను నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల ఆవరణలో అందమైన రంగవల్లికలను పరిచి సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో కేఈఎస్ చైర్మన్ కడియాల సతీష్, డ్రగ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్. వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ రఘునందన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.


ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

అలరించిన ఎడ్యుకేషనల్ ఫెస్ట్

సైదాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని శ్రీ త్రివేణి పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థుల ఎడ్యుకేషనల్ ఫెస్ట్-2024 అందరిని అలరించింది. విద్యార్థులు 2024-25లో నేర్చుకున్న పాఠ్యాంశాలను మోడల్స్ రూపంలో, డ్రామా, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ముఖ్య అతిథులు ప్రొఫెసర్ హేమ ఠాకూర్, కళ్యాణ్‌శర్మ, స్కూల్ కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారద, ఇన్‌చార్జి మాధురి తదితరులు పాల్గొన్నారు.

తిరుప్పావై పాశురాల పారాయణం


తిరుప్పావై పాశురాల పారాయణం చేస్తున్న భక్తులు

కొత్తపేట : కొత్తపేట స్నేహపురికాలనీలో వెలసిన గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా భక్తులు విష్ణుసహస్ర నామ పారాయణం, పాశురాల పారాయణం చేశారు. తెల్లవారు జామున ఆలయంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో స్వామివార్లకు ప్రత్యేక పూజల తర్వాత సామూహిక పారాయణం చేశారు.

జైలులో పరిచయం.. స్నేహంగా మారి..

గంజాయి దందా చేస్తున్న ముఠా అరెస్ట్

- 4.5 కిలోల గంజాయి స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డ నేరస్థులు జైలులో పరిచయం అయ్యారు. జైలు నుంచి బయటికి వచ్చి ముఠాగా ఏర్పడి పకడ్బందీగా గంజాయి రవాణా, విక్రయాలు చేస్తున్న నలుగురు నిందితులను, నలుగురు గంజాయి కొనుగోలుదారులను ఎల్బీనగర్ ఎస్ఓటీ, హయత్‌నగర్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన నాయని శ్యాం(22) హయత్‌నగర్ అమన్‌గల్ బస్తీలో ఉంటూ పాల వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా గంజాయి తాగడానికి అలవాటుపడ్డ ఇతడు ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు, ధూల్‌పేటలో గంజాయి కొని అధిక ధరలకు విక్రయించేవాడు. ఇలా ఈజీ మనీకి అలవాటు పడి గంజాయి విక్రయిస్తున్న శ్యాంను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అరెస్ట్ చేసి, జైలుకు పంపారు. గంజాయి విక్రయాలు చేస్తున్న మహబూబాబాద్‌కు చెందిన కందుకూరి చందు అలియాస్ ప్రేమ్‌చంద్(18)ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిద్దరూ జైలులో పరిచయం అయ్యారు. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత డిగ్రీ చదువుతున్న బుర్రా రాజేష్‌కుమార్ అలియాస్ రాము(20), బాలాపూర్‌కు చెందిన చిత్రం ఉదయ్‌కిరణ్(20)తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా గంజాయి సేవించడానికి అలవాటుపడడంతో ధూల్‌పేట నుంచి గంజాయి కొనుగోలు చేసి, తాగడంతోపాటు హయత్‌నగర్ ప్రాంతంలో కస్టమర్లకు అధిక ధరలకు విక్రయించేవారు. వీరికి ఒడిషా మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన గంజాయి విక్రేత అర్జున్‌తో పరిచయం అయింది. దాంతో వీరు ఒడిషా వెళ్లి తక్కువ ధరకే గంజాయి కొనుగోలు చేయడం ప్రారంభించారు. ఒడిషాలో కిలో గంజాయి రూ.మూడువేలకు కొనుగోలు చేసి, వాటిని 100 గ్రాముల ప్యాకెట్‌లుగా మార్చి ఒక్కో ప్యాకెట్ రూ. రెండువేలకు విక్రయిస్తున్నారు. వీరి వద్దనుంచి దసరామోని రాఘవేందర్, జోగు వరుణ్‌కుమార్, గుడిమల్ల మహేష్, మర్రి అఖిల్‌రాజ్‌లు కొనుగోలు చేస్తున్నారు. డిసెంబర్ 30న ఒడిషా వెళ్లిన శ్యాం 7కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. వాటిని చిన్న ప్యాకెట్లలో మార్చి విక్రయించడం ప్రారంభించాడు. ఇతడి దందాపై పక్కా సమాచారమందుకున్న ఎస్ఓటీ, హయత్‌నగర్ పోలీసులు హయత్‌నగర్ జీ స్కూల్ వెనుకవైపు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 4.50కిలోల గంజాయి, మూడు బైకులు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

మరో కేసులో 1.50 కిలోల గంజాయి

మీర్‌పేట్ ఆదిత్యనగర్‌కు చెందిన బర్సు నాగేందర్ శ్రీనివాస్ (28) బతుకుదెరువు కోసం ర్యాపిడో రైడర్‌గా పనిచేస్తున్నాడు. అధిక సంపాదన కోసం ఇతడు గంజాయి విక్రయాలు చేస్తున్నాడు. ఇతడి దందాపై పక్కా సమచారమందుకున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ, హయత్‌నగర్ పోలీసులు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 1.50 కిలోల గంజాయి, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.


సౌభాగ్యపురంకాలనీ ఆలయంలో ఉత్తరద్వారం గుండా స్వామివారిని దర్శించుకుంటున్న పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, దేప సురేఖ దంపతులు


గ్రీన్‌పార్క్‌కాలనీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ రాజశేఖర్‌రెడ్డి


వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారి పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ లచ్చిరెడ్డి


అష్టలక్ష్మీ ఆలయంలో స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి వేచి ఉన్న భక్తులు

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ

- భక్తి శ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి
- వైష్ణవాలయాల్లో భక్తుల రద్దీ

ఎల్బీనగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) సందర్భంగా శుక్రవారం వైష్ణవాలయాలు భక్తకోటితో పులకించి పోయాయి. స్వామివారిని ఉత్తరద్వార దర్శనం చేసుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆర్‌కేపురం వాసవీకాలనీలోని అష్టలక్ష్మీఆలయంలో భక్తులు వైకుంఠ ద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్నారు. పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేప సురేఖ దంపతులు అష్టలక్ష్మీఆలయంతో పాటు సౌభాగ్యపురం కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలను సందర్శించి స్వామి వారిని ఉత్తరద్వారం గుండా దర్శించుకున్నారు. యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక మధు రాఉపేందర్‌రెడ్డి దంపతులు, కాంగ్రెస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నిర్మల దంపతులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు పుష్పలత దంపతులు, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.

బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లలో...

సరూర్‌నగర్ : ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని వైష్ణవాలయాలు భక్తులతో పోటెత్తాయి. జిల్లెలగూడలోని మత్స్యావతార వేంకటేశ్వరస్వామి ఆలయం, బడంగ్‌పేట్‌లోని కాశీబుగ్గ వేంకటేశ్వరాలయంతో పాటు ఇతర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లో మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : మండల పరిధిలోని కవాడిపల్లి కోదండ రామచంద్రస్వామి ఆలయంలో, గండిచెరువులోని రంగనాథస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీవాణి ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకున్నారు.


జిల్లెలగూడ ఆలయంలో బారులు తీరిన భక్తులు

దిల్‌సుఖ్‌నగర్ : దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, వీవీనగర్, కోదండరామనగర్‌లోని ఆలయాలకు భక్తులు బారులు తీరారు. లలితానగర్‌లోని వీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయం, కోదండరాంనగర్‌లోని అలివేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, వీవీనగర్‌లోని కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం, దిల్‌సుఖ్‌నగర్ షిరిడీసాయి సంస్థాన్, శివాలయం, నేతాజీనగర్‌లోని శివాలయాలలో ఉత్తరద్వారం ద్వారా భక్తులు దేవుడిని దర్శించుకున్నారు.

వనస్థలిపురం: వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి దంపతులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఎల్బీనగర్ అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు, శ్రీహిందు ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ రం గినేని వెంకట్‌రావు దంపతులు రెడ్ వాటర్ ట్యాంక్ సమీపంలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సైదాబాద్ : సైదాబాద్ పూసలబస్తీ తిరుమల హిల్స్, సైదాబాద్‌కాలనీ, ఎస్‌బీహెచ్‌బీకాలనీ, లక్ష్మీనగర్ భక్తసమాజం, సాయిబాబా ఆలయాల్లో భక్తులు, పూసలబస్తీ వేంకటేశ్వరాలయంలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ దంపతులు, తిరుమలహిల్స్ ఆలయం మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ దంపతులు పూజలు నిర్వహించారు.

సంతోష్‌నగర్ : సంతోష్‌నగర్‌లోని పద్మావతిగోదాసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి దంపతులు, వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ శేఖర్‌రెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

చంపాపేట : చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలోని కోదండ రామాలయంలో సీతారామచంద్రస్వామికి అర్చకులు ఉదయం 3:30 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. 6గంటల నుంచి భక్తులకు స్వామి వారి ఉత్తర(వైకుంఠ) ద్వారా దర్శనములు కల్పించారు. ఆలయ ఈవో ఎన్. లావణ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.


కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ఉత్తరద్వార దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

హస్తినాపురం డివిజన్‌లో..

హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్‌కాలనీలోని రామాలయంలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి దంపతులు, ఉత్సవ కమిటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు స్వామి వారిని దర్శించుకున్నారు.

మన్సూరాబాద్ : మన్సూరాబాద్, నాగోల్ ప్రాంతాల్లోని వైష్ణవాలయాలతో పాటు పలు చోట్ల శైవాలయాల్లో ఉత్తర ద్వారం గుండా ఆ మహావిష్ణువుడిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచి ఆలయాలకు పోటెత్తారు. దీంతో ఆలయాలు, ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి.

కొత్తపేట : స్నేహపురికాలనీ, న్యూనాగోల్, సాయినగర్ తదితర ప్రాంతాల్లో ముక్కోటి ఏకాదశి వేళ భక్తులు గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల విజయవినాయక ఆలయం, అయ్యప్పస్వామి ఆలయం, కాశీవిశ్వేశ్వరాలయం, ప్రసన్నాంజనేయస్వామి ఆలయాల్లో, మోహన్‌నగర్‌లోని హరిహరక్షేత్రంలో పద్మావతీ వేంకటేశ్వరాలయం, సత్యానగర్ హరిహర క్షేత్రంలోని వేంకటేశ్వరాలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు.


పూసలబస్తీ వెంకటేశ్వరాలయంలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ దంపతుల పూజలు


స్వామివారిని ఉత్తరద్వార దర్శనం చేసుకున్న కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి


విజయశ్రీకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్పొరేటర్ నర్సింహారెడ్డి, ఆలయ చైర్మన్ నర్సిరెడ్డి పూజలు


తొర్రూర్‌లోని రంగనాథస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న తెలంగాణ రోడ్లు, భవనాల కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

సీఎం సహాయనిధి మంజూరులో పక్షపాతం తగదు

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సీఎం సహాయ నిధి చెక్కుల మంజూరులో పక్షపాతం వహిస్తున్నారని, ఇది పేదలను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నదని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఆస్పత్రి ఖర్చులతో పోల్చుకుని 50నుంచి 70శాతం దాకా బిల్లులు మంజూరు చేసేవారని, ఇప్పుడు కనీసం 15నుంచి 20శాతం కూడా ఇవ్వడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి, తుక్కుగూడ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ నిరు పేదలు ఎంతో ఆశతో సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకుంటే వాటి మంజూరీలో నెలల తరబడి జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. వైద్యానికి అయిన ఖర్చులో 50శాతం కూడా సహాయం చేయకపోతే ఎలా? అని ఆమె ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పేదల అవసరాన్ని గుర్తించి సీఎం సహాయనిధి దరఖాస్తులను తొందరగా క్లియర్ చేయాలని, మంజూరీ మొత్తాన్ని సైతం 50శాతానికి తగ్గకుండా చూడాలని ఆమె సూచించారు.


సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులకు మంజూరైన ట్రైసైకిళ్లను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి

మన్సూరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలని నాగోల్‌లోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ డ్రైవింగ్ పరీక్ష విధాన ప్రాంగణ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు విష్ణుదీపక్, అనితారెడ్డిలు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఇన్‌చార్జి ఆర్టీఓ అమర్‌నాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం నాగోల్ ఆర్టీఏ కార్యాలయం ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న రాజీవ్ గాంధీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేణు, ప్రసాద్, అబిలాష్‌లతో కలిసి విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గీత, మినిస్ట్రియల్ స్టాఫ్, సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, నాగోల్ ఆర్టీఏ సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ ఇన్‌స్పెక్టర్లు విష్ణుదీపక్, అనితారెడ్డి, సిబ్బంది

ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు


కేశాలంకరణ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

చాదర్‌ఘాట్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కాలడేరా ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు వివిధ వేశధారణలతో పల్లె వాతావరణం అద్దం పట్టినట్లు ప్రదర్శించిన కళానైపుణ్యం అందరిని అబ్బురపరిచింది. చిన్నారులకు పతంగుల పంపిణీ, విద్యార్థుల నృత్యాలు మురిపించాయి. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మండడి వెంకట్‌రెడ్డి, బాలభవన్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు అంజనేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు సుజాత, నిర్మల, అమరావతి, సమత, స్వాతి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట జడ్‌పీహెచ్ఎస్‌లో..

కొత్తపేట : కొత్తపేట జడ్‌పీహెచ్ఎస్‌లో శుక్రవారం సంక్రాంతి వేడుకలను ఉల్లాసం గా నిర్వహించారు. తొలుత చంద్రకళ టీచర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేశాలంకరణ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తోటి విద్యార్థినులకు ఆకర్షణీయంగా జడలు వేశారు. కళాత్మకంగా జడలు వేసి ప్రతిభ ను చాటుకున్నారు. అనంతరం పాఠశాలలో బాలికలతో పాటు బాలురు సైతం రంగు రంగుల్లో సందేశాత్మక రంగవల్లులు తీర్చి దిద్దారు. సంక్రాంతి పండుగకు, సంప్రదాయానికి అద్దంపట్టే ముగ్గులూ వేశారు. హెచ్ఎం విజయేందర్‌రెడ్డి, టీచర్లు శాంత సాయి, శైలజ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ స్వాతి పాల్గొన్నారు.


వేడుకల్లో చిన్నారులు, ఉపాధ్యాయులు


సంక్రాంతి క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న నర్సింహ తదితరులు

పెద్దఅంబర్‌పేట్ జడ్పీహెచ్ఎస్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్ : ఎస్ఎఫ్ఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేట్ జడ్పీహెచ్ఎస్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రీడోత్సవాలను శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి ఏర్పుల నర్సింహ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన జట్లకు బహుమతులను అందించనున్నట్లు చెప్పారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్, సాయి, వంశి, శ్రీశైలం, సలీం పాల్గొన్నారు.



పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ)గా నియమితులైన సానే భాస్కర్‌రెడ్డిని శుక్రవారం జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



తెలంగాణ బీసీ న్యాయవాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జూపల్లి కృష్ణ ఆధ్వర్యంలో రూపొందించిన 2025-నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. న్యాయవాదుల సమస్యలు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. సంఘం ఉపాధ్యక్షుడు భూపాల్‌రాజ్, సలహాదారుడు రామ్మోహన్, సంయుక్త కార్యదర్శు లు రాజేశ్వర్, బ్రహ్మాచారి, రమేష్‌యాదవ్ పాల్గొన్నారు. - ఎల్బీనగర్, ఆంధ్రజ్యోతి

క్యాలెండర్ ఆవిష్కరణ

చంపాపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ తెలంగాణ విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్-2025ను శుక్రవారం కర్మన్‌ఘాట్‌లో విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం డివిజన్ అధ్యక్షుడు నారోజు రాఘవేంద్రచారి బీఆర్ఎస్ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు అందోజు సత్యంచారిలు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండలోజు సత్యనారాయణచారి, రావల్లి కృష్ణమాచారి, కాసోజు బాలిశ్వరాచారి, ప్రభాకర్‌చారి, రాంచంద్రాచారి, యాదగిరిచారి, వెంకటేశ్‌చారి, రాజుచారి, విష్ణుచారి, వీరాచారి పాల్గొన్నారు.

ఉరేసుకుని గృహిణి ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ ప్రగతినగర్‌కాలనీలో కొంత కాలంగా కాళ్ల సౌజన్య(30), రామకృష్ణ దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామకృష్ణ మేస్త్రీ పనులు చేస్తుండగా సౌజన్య ఇంట్లోనే ఉంటుంది. కాగా శుక్రవారం ఉదయం పిల్లలను స్కూల్‌కు పంపించింది. అనంతరం భర్త మేస్త్రీ పనికి వెళ్లాడు. 10గంటల సమయంలో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పది ఏళ్ల క్రితం సౌజన్య, రామకృష్ణ ప్రేమ వివాహం చేసుకున్నారు. కొంత కాలంగా ఆమె మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో చిన్నచిన్న విషయాలకు భర్తతో గొడవపడుతుండేదని తెలిసింది. ఆ కారణంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.